

బేతంచెర్ల మండలం రంగాపురంలో..

గంగ ఒడికి గణేశుడు

- గ్రామాల్లో ముగిసిన గణేశ్ నిమజ్జనోత్సవం
- ఆత్మకూరులో కోలాహలంగా శోభ యాత్ర



దొర్నిపాడులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు



శిరివెళ్లలో ఊరేగింపుగా వెళ్తున్న గణనాథుడు



ఆత్మకూరులో నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథులు

వినాయక ఉత్సవాల్లో విశేష పూజలందుకున్న గణేశుడు సోమవారం వైభవంగా గంగ ఒడికి చేరాడు. నంద్యాల జిల్లాలోని మండల కేంద్రాలు, గ్రామాల్లో మూడో రోజు వినాయక నిమజ్జన వేడుకలు కోలాహలంగా జరిగాయి. జై గణేశా.. జైజై గణేశా నినాదాలు, మేళతాళాలతో గణనాథుడి నిమజ్జన కార్యక్రమం సంబరంగా సాగింది. నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, బనగానపల్లె, డోన్ పట్టణాల్లో మినహా అన్ని ప్రాంతాల్లో నిమజ్జనోత్సవాలు జరిగాయి. సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించి మండపాల నుంచి వినాయకుడిని కదిలించారు. నిమజ్జన కార్యక్రమానికి ఆటంకం లేకుండా తగిన జాగ్రత్తలతో యువత నృత్యాలు చేస్తూ.. కోలాటాలు ఆడుతూ వినాయకుడిని గంగ ఒడికి సాగనంపారు. ఆత్మకూరు పట్టణంలో భారీ వినాయక విగ్రహాలు వెళ్తుండగా శోభా యాత్రలో యువతీ యువకుల ఉత్సాహం, కేరింతలతో సందడి నెలకొంది. ఆయా ప్రాంతాల్లోని నదులు, వంకలు, చెరువుల్లో వినాయక విగ్రహాలకు నిమజ్జనం పూర్తి చేశారు.

\- ఆత్మకూరు



కొత్తపల్లెలో కోలాట నృత్యం చేస్తున్న మహిళలు



రెడ్డిపల్లె మెట్ట వద్ద గణనాథుడిని తెలుగుగంగ ఉప కాల్వలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



ఆత్మకూరులో..



రుద్రవరం పురవీధుల్లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



గేట్లన్నీ మార్చాల్సిందే..!

- ఏడు దశాబ్దాలుగా అవే గేట్లు
- వాటి జీవిత కాలం 45 ఏళ్లు
- ఇప్పటికే 25 ఏళ్లు అదనంగా వినియోగం
- మరమ్మతులు చేస్తే జలాశయానికే ప్రమాదకరం
- తుంగభద్ర డ్యాంను పరిశీలించిన నిపుణుల కమిటీ
- డ్యాం గేట్లు, గ్యాలరీ తనిఖీ
- ప్రాజెక్టు నిర్వహణ ఇంజనీర్లతో భేటీ

కర్నూలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

తుంగభద్ర ప్రాజెక్టుపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ కీలక అంశాలను తెరపైకి తెచ్చింది. తుంగభద్ర డ్యాంకు సంబంధించి మొత్తం 33 గేట్లు మార్చాల్సిందేనని ఆ కమిటీ సూచించినట్లు సమాచారం. 70 సంవత్సరాలుగా అవే గేట్లను వినియోగిస్తున్నారు. నిజానికి డ్యాం గేట్ల జీవిత కాలం 45 సంవత్సరాలు. అయినప్పటికీ తుంగభద్ర డ్యాం గేట్లు మరో 25 సంవత్సరాలకు పైగా పొడిగించి వినియోగిస్తున్నారు. మళ్లీ వాటికి మరమ్మతులు చేస్తే డ్యాం భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సేఫ్టీ కమిటీ హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ మూడు రాష్ట్రాల జీవనాడిగా ఉన్న తుంగభద్ర జలాశయానికి ఉన్న 33 పాత గేట్లను పూర్తిగా తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాల్సిందేనని కమిటీ సూచించింది.

డ్యాం నిర్వహణ ఇంజనీర్లతో భేటీ

తుంగభద్ర డ్యాంను 1 నుంచి 16వ నెంబరు గేటు వరకు తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు నిర్వహణలో ఉంది. 17వ గేటు నుంచి కర్ణాటక జలవనరుల శాఖ ఇంజనీర్లు పర్యవేక్షిస్తున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారం భానికి ముందు వరదలు మొదలయ్యాక డ్యాం గేట్ల పనితీరును ఇంజనీర్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలి. డ్యాం నిర్వహణ ఎలా జరుగుతుంది? ఈ ఏడాది నీటి సంవత్సరం ప్రారంభంలో వర్షాలు రాకముందు డ్యాంకు వరద మొదలయ్యాక గేట్లను తనిఖీ చేశారా? మరమ్మతులు నిర్వహించారా? ఆ సమయంలో ఎలాంటి లోపాలను ఏవైనా గుర్తించారా? గుర్తించి ఉంటే ఎలాంటి లోపాలు గమనించారు. తదితర అంశాలపై నిర్వహణ నిపుణుల కమిటీ ఇంజనీర్లతో సమావేశమై వివరాలు సేకరించారు. అంతేగాకుండా డ్యాం నిర్మాణం మొదలుకుని ఆ తర్వాత నిర్వహణ, ఇప్పటి వరకు డ్యాంను పరిశీలించిన నిపుణులు ఇచ్చిన నివేదికలు, ఇప్పటిదాకా చేపట్టిన మరమ్మ తులు తదితర రికార్డులను కూడా పరిశీలించారు.

కొట్టుకుపోయిన 19వ నెంబరు గేటు

తుంగభద్ర జలాశయానికి ఈ ఏడాది ముందుగానే వరదలు మొదలయ్యాయి. జూలై నెలలోనే గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకు వరద చేరి, ఆ పైన లక్షల క్యూసెక్కుల వరద ఉండటంతో 33 గేట్లు ఎత్తి నదికి నీటిని విడుదల చేశారు. దాదాపు 200 టీఎంసీలు తుంగభద్ర డ్యాం నుంచి శ్రీశైలానికి వదిలారు. ఆగస్టు 10వ తేదీ నాటికి వరద తగ్గిపోవడంతో 1,633 అడుగుల లెవల్‌లో 105.788 టీఎంసీలు పూర్తి స్థాయి సామర్థ్యంలో ఎత్తిన గేట్లను డ్యాం ఇంజనీర్లు దించారు. ఆ సమయంలో 19వ నెంబరు గేటు చైన్‌లింక్ తెగిపోయి భారీ శబ్దంతో క్రస్టు గేటు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. డ్యాం భద్రత దృష్ట్యా క్రస్ట్ లెవల్ 1,613 అడుగుల వరకు ఖాళీ చేయాల్సి వచ్చింది. అదే జరిగితే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమకు చెందిన కర్నూలు, అనంతపురం జిల్లాల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడేది. ఆ సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్యాం భద్రత దృష్ట్యా క్రస్టు గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామనాయుడు, పయ్యావుల కేశవ్‌లను డ్యాంకు పంపించి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. కర్ణాటక సీఎం సిద్ద రామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సైతం డ్యాంను పరిశీలించి సీఎం చంద్రబాబు ఆలోచనతో కన్నయ్య నాయుడు సారథ్యంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటుకు కృషి చేశారు. 75 టీఎంసీల నీటిని నిల్వ ఉండగానే కన్నయ్యనాయుడు నేతృత్వంలో ఇంజనీర్లు, కార్మికులు, వారం రోజులు రేయింబవళ్లు కష్టపడి దిగ్విజయంగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ సెగ్మెంట్లు ఏర్పాటు చేసి రైతుల సాగునీటి కష్టాలు తీర్చారు. ప్రస్తుతం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంది.

డ్యాం భద్రతపై సీడబ్ల్యూసీ దృష్టి

తుంగభద్ర డ్యాం భద్రతపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) దృష్టి సారించింది. అదే సమయంలో కొట్టుకుపోయిన 19వ నెంబరు గేటుతో పాటు 33 గేట్ల భద్రతపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేలా నిపుణుల కమిటీని నియమించాలంటూ తుంగభద్ర బోర్డు సెక్రటరీ ఓ.రామకృష్ణ రెడ్డి నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి లేఖ రాశారు. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలో హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ హర్కేష్ కుమార్, తారాపురం సుధాకర్‌లతో పాటు బోర్డులో భాగస్వామ్యమైన ఏపీ, కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు సూచించిన ప్రతినిధులతో నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ డ్యాంను సమగ్రంగా పరిశీలించింది. మంగళవారం కూడా క్రస్టు గేట్లు, గ్యాలరీ, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్‌ను సమగ్రంగా పరిశీలిస్తారు. అనంతరం తమ అధ్యయనంలో వెలుగు చూసిన వివిధ అంశాలతో కూడిన సమగ్ర నివేదికను సీడబ్ల్యూసీ, తుంగభద్ర ప్రాజెక్టు బోర్డుతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తారని బోర్డు అధికారులు తెలిపారు.



తుంగభద్ర డ్యాంను పరిశీలిస్తున్న నిపుణుల కమిటీ బృందం

తుంగభద్ర జలాశయం భద్రతపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ సోమవారం పరిశీలించింది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ ఎక్స్‌పర్ట్ హర్కేష్ కుమార్, ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్, ఆయా రాష్ట్రాల ప్రతినిధుల బృందం సభ్యులు డ్యాంను పరిశీలించారు. గత ఆగస్టు 10వ తేదీన చైన్ లింక్ తెగిపోయి కొట్టుకుపోయిన 19వ గేటు సహా డ్యాం 33 గేట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఢిల్లీకి చెందిన ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు ఏకే బజాజ్, హర్కేష్ కుమార్, తారాపురం సుధాకర్‌లు ఢిల్లీ నుంచి బెంగుళూరు చేరుకున్నారు. అక్కడి నుంచి హోస్పేట్ దగ్గరున్న టీబీ డ్యాంకు ఉదయం చేరుకున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు (టీబీపీ) సెక్రటరీ ఓ.రామకృష్ణారెడ్డి, ఎస్ఈ శ్రీకాంత్ రెడ్డి, డ్యాం పర్యవేక్షణ ఇంజనీర్లు వారికి స్వాగతం పలికారు. వీరితో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సెంట్రల్ డీజైనింగ్ ఆర్గనైజేషన్ (సీడీవో) ప్రతినిధులు కూడా ఉన్నారు. ముందుగా డ్యాం వివరాలను బోర్డు అధికారుల ద్వారా తెలుసుకున్నారు. గత నెలలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన 19వ నెంబరు గేటును క్షుణ్ణంగా పరిశీలించారు. 1 నుంచి 33 గేట్ల వరకు ప్రతి గేటును ఆపరేషన్ తీరు, చైన్స్, గేట్లను సమగ్రంగా పరిశీలించారు. అంతేగాకుండా ప్రాజెక్టు గర్భంలో ఉన్నటువంటి గ్యాలరీని నిపుణుల కమిటీ పరిశీలించింది.

ఐదు గేట్ల ద్వారా నీరు విడుదల



శ్రీశైలం డ్యాం గేట్ల నుంచి నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద

శ్రీశైలం, సెప్టెంబరు 9: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం జలాశ యానికి ఇన్‌ఫ్లో పెరగడంతో డ్యాం అధికారులు జలాశయం ఐదు క్రస్టుగేట్లను తెరిచి దిగువ నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 2,10,056 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 35,832 క్యూసెక్కులు మొత్తం 2,45,888 వరద వస్తోంది. జలాశయం ఐదు క్రస్టు గేట్లు ఎత్తి 1,36,245 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి డ్యాంలోకి 2,37,552 క్యూసెక్కుల మేర వరద వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883.40 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 206.5365 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 31,094 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపండి

- కలెక్టర్ రాజకుమారి
- పీజీఆర్‌ఎస్‌కు 187 అర్జీలు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 9: ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రజా విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాలులో పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో 187 మంది తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్‌ఎల్‌ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. డీఆర్వో పద్మజ, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలానికి రికార్డు స్థాయిలో 1,139.85 టీఎంసీల వరద

కర్నూలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు 2024-25 సంవత్సరంలో సోమవారం వరకు 1,139.85 టీఎంసీల వరద చేరినట్లు ప్రాజెక్టు ఇంజనీర్లు అంచనా వేశారు. జూరాల ప్రాజెక్టు దాటి కృష్ణా నది ద్వారా 797.68 టీఎంసీలు, సుంకేసుల బ్యారేజీని దాటుకుని తుంగభద్ర నది నుంచి 217.51 టీఎంసీలు, హంద్రీ నది నుంచి 1.01 టీఎంసీలు కలిపి 1139.85 టీఎంసీలు వరద చేరింది. స్పిల్‌వే గేట్లు ఎత్తి 604.53 టీఎంసీలు, రైట్ పవర్ కెనాల్ ద్వారా ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 101.45 టీఎంసీలు, తెలంగాణ ప్రభుత్వం లెఫ్ట్ పవర్ హౌస్ ద్వారా 152.74 టీఎంసీలు కలిపి 858.72 టీఎంసీలు దిగువన నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. అలాగే రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 93.21 టీఎంసీలు, హంద్రీనీవా ఎత్తిపోతల పథకం నుంచి 4.24 టీఎంసీలు, తెలంగాణ ప్రభుత్వం కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 9.91 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. మూడు నెలల్లోనే రికార్డు స్థాయిలో వరద చేరిందని ఇంజనీర్లు పేర్కొన్నారు.

టెర్రరిస్టులను తలపించేలా వైసీపీ ఐదేళ్ల పాలన

\- మంత్రి బీసీ

బనగానపల్లె, సెప్టెంబరు 9: ఐదేళ్ల వైసీపీ పాలన టెర్రరిస్టులను తలపించేలా సాగిందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మంత్రి బీసీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమం సామాజిక న్యాయం ధ్యేయంగా పాలన చేస్తున్నారన్నారు. నీతి, నిజాయితీ, చట్టబద్ధత పారదర్శకత చంద్రబాబు ప్రత్యేకత అన్నారు. చంద్రబాబును గత ఏడాది ఇదే రోజు నంద్యాలలో అర్ధరాత్రి అరెస్టు చేసి 52 రోజులు జైళ్లో పెట్టాలరని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా ధర్నాలు, నిరసనలు పెద్దఎత్తున జరిగాయని తెలిపారు. చంద్రబాబునాయుడు విడుదలైన రోజుకు ముందు జనాలు రాత్రంతా జాగారం చేసి చంద్రబాబుకు స్వాగతం పలికారన్నారు. అరెస్టు అయిన ఏ నేతకు ఇలాంటి సంఘీభావం రాలేదన్నారు. చంద్రబాబునాయుడుకు నేర ఘటనలో భాగస్వామ్యంగా ఉన్నట్లు ప్రాథమికంగా కనిపించలేదని తెలిపారు. కేసు నమోదు చేసిన 22 నెలలకు నిందితుడిగా చేర్చడం దారుణమన్నారు. వైసీపీ అరాచక పాలనకు వ్యతిరేకంగా ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే ఏపీ పునర్నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బురానుద్దీన్, టంగుటూరు శ్రీనయ్య, కృష్ణానాయక్, జనసేన నాయకుడు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

చంద్రబాబు పాలన ఆదర్శవంతం

మంత్రి టీజీ భరత్



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 9: సీఎం చంద్రబాబు నాయుడు ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేస్తే వర్గాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలందరూ ఖండించారని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా మద్దతు పలికారని, అరెస్టు అయిన ఏ రాజకీయ నేతకు ఇలాంటి సంఘీభావం రాలేదన్నారు. 4 దశాబ్దాలుగా ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తూ ఎలాంటి మచ్చలేని చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం తప్పుడు కేసులతో ఏడాది క్రితం అరెస్టు చేయించిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఒక్క రూపాయి అవినీతిని కూడా వైసీపీ నిరూపించలేకపోయిందన్నారు.

చంద్రబాబు అరెస్టుతో వైసీపీ పతనం


ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



కర్నూలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతోనే వైసీపీ పతనం మొదలైందని ఎమ్మిగనూరు టీడీపీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎమ్మిగనూరులో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలన టెర్రరిస్టు విధానాలను తలపించిందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు తెలుగు ప్రజల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం పరితపించిన చంద్రబాబును జగన్ ప్రభుత్వం అరెస్టు చేయడంతో ప్రజల్లో ఆగ్రహం రగిలిందన్నారు. అరెస్టు చేసి టీడీపీని దెబ్బతీయాలని వైసీపీ కక్ష కడితే ప్రజలు జగన్‌కు, ఆ పార్టీకి గోరీ కట్టారని ధ్వజమెత్తారు. చంద్రబాబు బాటలోనే నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటు పడుతామన్నారు.

టెర్రరిస్టు పాలనను తలపించిన జగన్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 9: గత ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి టెర్రరిస్టు పాలనను తలపించాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో.. రాజకీయ కక్షతో ఎలాంటి అవినితికి పాల్పడ కపోయినా చంద్రబాబుపై కుట్రలు పన్ని అధికారాన్ని అడు పెట్టుకుని జగన్ సీఐడీ ద్వారా అరెస్టు చేయించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు కూడా 11 సీట్లకే పరిమితం చేసి ప్రతి పక్ష హోదా లేకుండా చేసినప్పటికీ జగన్ రెడ్డికి జ్ఞానోదం కాలేదని అన్నారు.

చంద్రబాబు అరెస్టుకు ఏడాది

టీడీపీ నంద్యాల అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, సెప్టెంబరు 9: టెర్రరిస్టు పాలనను తలపించేలా ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజా నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి ఏడాదైందని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం ధ్యేయంగా పని చేశారన్నారు. అక్రమ అరెస్టుకు నిరసనగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సంఘీభావం ప్రకటించాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా మద్దతు పలికారని, 70 దేశాల్లో చంద్రబాబుకు సంఘీభావం ప్రదర్శనలు చేశారని అన్నారు. చంద్రబాబు విడుదలైన రోజు రాజమండ్రి నుంచి విజయవాడ చేరడానికి రాత్రంతా జనం రోడ్లపై జాగరణ చేసి చంద్రబాబుకు స్వాగతం పలికారని, ఏ రాజకీయ నేతకు ఇతంటి సంఘీభావం రాలేదని పేర్కొన్నారు. అక్రమ అరెస్టుకు నిరసనగా చరిత్రలో నిలిచిపోయేలా వైసీపీకి 11 సీట్లను మాత్రమే ప్రజలు పరిమితం చేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బజారు, వేణు, విక్రమ్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుతోనే వైసీపీ పతనం

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 9: ఏడాది కింద చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టు వైసీపీ పతనానికి నాందీ, కూటమి విజయానికి పునాది అయిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నంద్యాలకు వచ్చిన చంద్రబాబును అరెస్టు చేయడం రాష్ట్ర ప్రజలను క్షోభకు గురి చేసిందన్నారు. దీంతో గత ఎన్నికల్లో 164 అసెంబ్లీ, 21 పార్లమెంట్ సీట్లలో కూటమికి ప్రజలు పట్టం కట్టారని అన్నారు.

యాగంటిపల్లె కేవీకేకు జాతీయ స్థాయి అవార్డు

బనగానపల్లె, సెప్టెంబరు 9: యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రానికి జాతీయ స్థాయిలో అత్యుత్తమ అవార్డు లభించింది. కేవీకే సీనియర్ సైంటిస్టు, హెడ్ ధనలక్ష్మి సోమవారం ఈ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. ఢిల్లీలో అవుట్‌లుక్ అగ్రిటెక్ సమ్మిట్, అవార్డు 2024కు గాను ఏపీ షిండే ఆడిటోరియంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన ఈ సమ్మిట్‌లో అద్భుతమైన వ్యవసాయ ఆవిష్కరణలను ప్రదర్శించడంతో పాటు భవిష్యత్ వ్యవసాయం అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన వ్యవసాయ రంగ మార్పులపై చర్చించినట్లు తెలిపారు. ఈ అవార్డు రావడం పట్ల కేవీకే సెక్రటరీ పెండేకంటి బాలాజీ అభినందించారు. ఢిల్లీలో జరిగిన ఈసమావేశంలో ఔట్‌లుక్ సీఈవో చంద్రనీల్‌రాయ్, ధనూక సీఈవో స్వరాజ్, రామ్‌గోపాల్ అగర్వాల్ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కేవీకే సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసన

జీవో నెం.115ను రద్దు చేయాలి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 9: కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు గుదిబండలా మారిన జీవో.నెం.115ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఉమ్మడి జిల్లాలోని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జీఎన్‌ఎం ట్రైనింగ్ చేసిన వారికి రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా ఎలా పోస్టులు ఇస్తారని ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు డి.మంజులాదేవి ప్రశ్నించారు. గత ప్రభుత్వం తప్పిదం చేసిందని, కూటమి ప్రభుత్వం జీవో నెం.115ను రద్దు చేసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11వేల మంది కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు 14 ఏళ్లుగా పని చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సు నిర్మలారాణి మాట్లాడుతూ జీఎన్‌ఎం శిక్షణ పొందిన వారికి రెగ్యులర్ స్టాఫ్ నర్సుల పోస్టులు ఇవ్వడం అన్యాయమని, ఏఎన్‌ఎంలు ఇప్పటికే రెగ్యులర్ పోస్టు ల్లో ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమ ర్పించారు ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, నంద్యాల, కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రుల కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

హంద్రీ, కేసీ కెనాల్‌ను కాపాడుకుందాం

- హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి
- దురాక్రమణ వల్లే హంద్రీ మాయం: చంద్రశేఖర కల్కూర

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 9: హంద్రీ నది, కేసీ కెనాల్‌లను పరిరక్షించుకోడానికి పోరాడాలని, లేకపోతే విజయవాడలో బుడమేరు దురాక్రమణ వల్ల వరదలు వచ్చినట్లే కర్నూలుకు ప్రమాదం పొంచి ఉంటుందని హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హంద్రీ నది, కేసీ కెనాల్‌లను కాలుష్యం నుంచి, ఆక్రమణల నుంచి కాపాడాలని, కర్నూలును స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దాలని కోరుతూ నగరంలోని జడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ముందు గల మహాత్ముని విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. అంతక ముందు ర్యాలీని ప్రారంభించిన గ్రంథాలయోద్యమ నాయకుడు, రచయిత చంద్రశేఖర్ కల్కూర మాట్లాడుతూ గత ఇరవై ఏళ్ల క్రితం హంద్రీ, కేసీ కాలువలో స్వచ్ఛమైన నీరు పారేదని, దురాక్రమణల వల్ల ఇప్పుడు హంద్రీ మాయమై పోయిందని అన్నారు. కేసీలో నగరంలోని చెత్త అంతా వేయడం వల్ల కాలుష్యం పెరిగిపోయి, నగరంలో దోమలు పెరిగాయని అన్నారు. స్వచ్ఛ కర్నూలును సాధించే వరకు ఉద్యమం జరగాలని, అధికారులపై, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హంద్రీనదిలో చెత్తాచెదారం, కంపచెట్లు, పూడిక తొలగించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీ నదికి రక్షణ గోడ నిర్మించాలని కోరారు. రైతుకూలీ సంఘం నాయకుడు రామకృష్ణ, సీపీఐ కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ హంద్రీనది నగరంలో ఆక్రమణలకు గురవుతోందని, అనధికార ఆక్రమణలను అరికట్టాలని కోరారు. కేసీ కెనాల్ వెంట ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన హంద్రీ నదిని శుభ్రం చేయాలని, వరదల నివారణకు రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజాభ్యుదయ నాయకుడు భార్గవ, జేవీవీ నాయకుడు శేషాద్రిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనం ప్రజల హక్కు అని, కేసీ, హంద్రీల వల్ల నేడు ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కేసీ కాలువలో మురుగునీరు కలువకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చాంద్‌బాషా, డేవిడ్, సుంకన్న, నాగన్న, శ్రీనివాసరావు, విరసం బాధ్యుడు పాణి, పౌర హక్కుల నాయకుడు అల్లాబకాష్, కరీంబాషా, రవికుమార్, యోహాను, మనోహర్ మాణిక్యం, డీటీఎఫ్ నాయకుడు రత్నం ఏసేపు, కేవీపీఎస్ సభ్యులు సుబ్బరాయుడు, భాస్కర్‌రెడ్డి, జహంగీర్, ఆరిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



హంద్రీ, కేసీ కెనాల్‌ను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టరేట్ ఎదుట ర్యాలీ నిర్వహిస్తున్న పరిరక్షణ కమిటీ సభ్యులు, నాయకులు

పంటల బీమాకు గ్రీన్ సిగ్నల్

- వాతావరణ బీమా కింద పత్తి, వేరుశనగ ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 9: ఈ ఆర్థిక సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సాగైన ప్రధాన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేసేందుకు మార్గదర్శకాలు రూపొందించి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయానికి చేరాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం రైతులు కట్టాల్సిన ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది. మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. దీంతో ఈ-పంటలో నమోదు చేసుకోవడంతో పాటు ఈకేవైసీ చేయించుకున్న రైతులందరికీ ఉచిత పంటల బీమా వర్తించనుందని జేడీ వరలక్ష్మి తెలిపారు. గ్రామం యూనిట్‌గా వరికి పంటల బీమాను వర్తింపజేశారని, అదేవిధంగా వాతావరణ బీమా కింద జిల్లాలో ప్రధానంగా సాగవుతున్న పత్తి, వేరుశనగ పంటలను ఎంపిక చేసినట్లు ఆదివారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 1.80 లక్షల హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. వేరుశనగ పంట దాదాపు 70 వేల ఎకరాల్లో సాగైంది. వాతావరణ బీమా కింద ఎంపిక చేసిన వేరుశనగ పంటకు వచ్చే నెలాఖరు వరకు అదే విధంగా పత్తి పంటకు నవంబరు 31 వరకు రైతులు బీమా చేసుకునేందుకు అవసరమైన దరఖాస్తులు నమోదు చేయాల్సి ఉంటుంది. పత్తి పంటకు హెక్టారుకు రూ.లక్ష చొప్పున, వేరుశనగ పంటకు రూ.70వేలకు బీమా వర్తిస్తుంది. కర్నూలు జిల్లాలో వరితో పాటు మండలం యూనిట్‌గా కంది, ఎండుమిర్చి, ఆముదం, జొన్న పంటలను చేర్చారు. జిల్లా యూనిట్‌గా సజ్జ, కొర్ర, ఉల్లి పంటలను చేర్చారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో గ్రామం యూనిట్‌గా వరి, మండలం యూనిట్‌గా మొక్కజొన్న, ఎండుమిర్చి, కంది, మినుము పంటలను చేర్చారు. జిల్లా యూనిట్ పరిధిలో కొర్ర, సజ్జ, ఆముదం జొన్న పంటలను చేర్చారు.

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను అధిగమించండి

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 9: వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ వేదికలో భాగంగా క్షేత్ర స్థాయిలో వంద రోజుల పనుల ప్రగతి లక్ష్యాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పనితీరు మెరుగు పరుచుకొని నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనుల లేబర్ బడ్జెట్, ఇళ్ల నిర్మాణాల పురోగతి, పంట నష్టం నమోదు, ఈ క్రాప్ బుకింగ్, ఓడీఎఫ్ ప్లస్ సర్వే తదితర అంశాలలో నిర్దేశించిన ప్రగతి లక్ష్య సాధనలో కొంతమంది మండల అధికారులు తక్కువ ప్రగతి సాధిస్తున్నారని అన్నారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల తదితర మండలాల్లో ఉపాధి హామీ కింద 1,100 ఎకరాల్లో చేపట్టిన పండ్ల తోటల పెంపకాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ ప్రణాళికలో 3,413 ఇళ్ల పూర్తి చేయాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 608 ఇళ్ల మాత్రమే పూర్తి చేయగలిగామన్నారు. పంట నష్ట వివరాలపై మంగళవారంలోగా నివేదిక ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు సంబంధించి ఈకేవైసీ పూర్తి చేసేవిధంగా గ్రామ వ్యవసాయ అధికారులు, వీఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వాస్తవ నివేదికలను వెంటనే పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డేటా బేస్ ప్రకారం పల్స్, ఓడీఎఫ్ ప్లస్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. 151 సంక్షేమ వసతి గృహాల్లో తనిఖీల నిమిత్తం స్పెషల్ అధికారులను నియమించామని, సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా హాస్టల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.

నిమజ్జనంలో అపశ్రుతి

తెలుగు గంగ కాలువలో బాలుడి గల్లంతు



లాల్‌బాషా(ఫైల్)

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 9: అహోబిలం గ్రామంలో సోమవారం చేపట్టిన గణేశ్ నిమజ్జనం కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. తెలుగు గంగ కాలువలో పడి ఓ బాలుడు గల్లంతయ్యాడు. వినాయక చవితి పండుగ రోజున అహోబిలంలోని కొందరు బాలురు చందాలు వేసుకొని గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మూడు రోజులపాటు చేసిన పూజలనంతరం తెలుగు గంగ క్వార్టర్స్ సమీపంలో ఉన్న తెలుగు కాలువలో నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్లారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసే సమయంలో ప్రమాదవశాత్తు నలుగురు బాలురు కాలువలో పడిపోయారు. అక్కడే ఉన్న గ్రామస్థులు వెంటనే ముగ్గురిని రక్షించారు. వీరిలో అహోబిలం గ్రామానికి చెందిన దస్తగిరి కుమారుడు లాల్‌బాషా (12) గల్లంతయ్యాడు. బాలుడి కోసం గజ ఈతగాళ్లు ముమ్మరంగా గాలిస్తున్నారు. అలాగే పట్టణంలోని ఆశ్రమం వీధిలోని గంగమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలోని గణేశ్ విగ్రహం వద్ద సందడి చేసుకుంటుండగా అశోక్(32) కుప్పకూలిపోయాడు. ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందాడు. దీంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అతిసారతో వృద్ధురాలు మృతి



ఇమాంబీ(ఫైల్)

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 9 : ఆళ్లగడ్డ పట్టణంలోని చాంద్ వీధిలో నివాసం ఉంటున్న ఇమాంబీ (70) అతిసారతో సోమవారం మృతి చెందింది. ఈమె గత పది రోజుల నుంచి ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ఈమెతోపాటు అదే వీధిలో నివాసం ఉంటున్న మరో ఐదుగురు అతిసారతో ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు.

17 నుంచి స్వచ్ఛత సేవా కార్యక్రమాలు

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 9: ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛత సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వచ్ఛత సేవ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గవర్నమెంటు ఆఫ్ ఇండియా సూచనల మేరకు ప్రతి సంవత్సరం స్వచ్ఛత సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఈవోఆర్‌డీఎస్, డీఎల్పీవోలు, జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కావాలన్నారు. 2024లో స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, డీపీవో నాగరాజు నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి రైతు ఆత్మహత్య

తుగ్గలి, సెప్టెంబరు 9: అప్పుల బాధతో రైలు కింద పడి సోమవారం ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని జొన్నగిరికి చెందిన హనుమన్న (59) సొంత పొలం నాలుగున్నర ఎకరాలతో పాటు 15 ఎకరాలు కౌలుకు తీసుకుని ఆముదం, పత్తి, కంది, వేరుశనగ పంటలు సాగు చేశాడు. ఇలా నాలుగేళ్ల నుంచి ఏటా సాగు చేసిన పంటలు అప్పులే మిగిల్చాయి. దీంతో దాదాపు రూ.15 లక్షలు అప్పులయ్యాయి. వాటిని ఎలా తీర్చాలో అర్థంగాక ఆదివారం ఇల్లు విడిచిపెట్టి వెళ్లాడు. ఈ క్రమంలోనే సోమవారం అనంతపురం జిల్లా జక్కలచెరువు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు హుటా హుటిన సంఘటనా స్థలానికి వెళ్లి బోరున విలపించారు. భార్య జమునమ్మ ఫిర్యాదు మేరకు గుత్తి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు మిద్దె రవికుమార్, సర్పంచ్ ఓబులేసు, బాలన్న, శేఖర్, గ్రామస్థులు రఘు రైతు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ట్రాక్టర్ ఢీకొని వివాహిత మృతి

గోనెగండ్ల, సెప్టెంబరు 9: మండల పరిధిలోని ఐరన్ బండ గ్రామంలో సోమవారం ట్రాక్టర్ ఢీకొని బోయ జయశ్రీ(29) మృతి చెందింది. ఐరన్ బండ గ్రామానికి చెందిన బోయ జయశ్రీ సోమవారం ఉదయం గొల్ల పద్మావతి అనే మహిళతో కలిసి వలిబాషా అనే రైతు వేరుశనగ పొలంలో కూలీ పని చేసేందుకు బయలుదేరింది. మార్గమధ్యంలో అంజనేయస్వామి రస్తా, ముల్లా చిన్నవలికి చెందిన పొలం దగ్గర వెనుక వైపు నుంచి అతివేగంగా ట్రాక్టర్ వచ్చి బోయ జయశ్రీని ఢీకొంది. దీంతో జయశ్రీ ఎగిరి రోడ్డుపై పడిపోయింది. చుట్టుపక్కల వారు గమనించి జయశ్రీని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి భర్త ముగ్గురు సంతానం ఉన్నారు. మృతురాలి భర్త బోయ రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

రుద్రవరం, సెప్టెంబరు 9 : మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన విజయలక్ష్మి (39) అనే మహిళ విష పదార్థం తిని సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్ఐ శోభన్‌బాబు వివరాల మేరకు.. ఎవరూ లేని సమయంలో ఇంట్లో విష పదార్థం తీసుకోగా చుట్టుపక్కల వారు గమనించి ఆదివారం రాత్రి ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి దాటిన తరువాత చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. మృతురాలికి భర్త శ్రీను, ఇద్దరు కుమారులు ఉన్నారు. నరసాపురం గ్రామానికి చెందిన విజయలక్ష్మికి నంద్యాల పట్టణంలోని భారత్‌నగర్‌కు చెందిన శ్రీనుతో 16 ఏళ్ల క్రితం పెళ్లి అయింది. మృతురాలి తల్లి నాగేంద్రమ్మ తమ కుమార్తె కొంత కాలం నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండేదని, జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిందని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ.9 లక్షలు, హైచర్ లారీ, జైలో వాహనం స్వాధీనం
- పరారీలో మరో నలుగురు



నిందితులను మీడియా ముందు హాజరు పరిచిన పోలీసులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు9: సంచలనం రేపిన జీఆర్‌పీ ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌ల ధ్వంసం, దొంగతనం కేసుల్లో అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మిగనూరు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా సింధువాడి గ్రామానికి చెందిన కరన్‌సరవదే, పర్భాని జిల్లాకు చెందిన ఖాదరాబాద్ మజీద్‌కు చెందిన ఖరీముద్దీన్, అదే జిల్లా పర్భాని పట్టణానికి చెందిన షేక్ జహీర్‌లతోపాటు మరో నలుగురు మంత్రాలయం, మాధవరం, కోసిగి, ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం మండలం తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న గురురాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ పంపుసెట్లను రెండు నెలల క్రితం పగులగొట్టారు. అందులో ఉన్న రాగి వైరు, రాగి ప్లేట్లు, ఆయిల్‌ను దొంగలించారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులు ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. ఈ చోరీ ఘటనలపై మంత్రాలయంలో మూడు కేసులు, నందవరంలో మూడు కేసులు, కోసిగిలో ఒక కేసు, అలాగే నంద్యాల జిల్లా డోన్, కడప జిల్లా కమలాపురంలో ఒక్కో కేసు నమోదయ్యాయి. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడమేకాకుండా రైతులకు లిఫ్టల ద్వారా సాగు నీరు అందించే యంత్రాలను దొంగలు పగులగొట్టి నిర్వీర్యం చేశారు. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో సాగు భూములకు సకాలంలో నీరు అందించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనలపై ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన పర్యవేక్షణలోనే ఎమ్మిగనూరు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో కర్నూలు స్పెషల్ బ్రాంచ్ సీఐ, కర్నూలు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శేషయ్య, కర్నూలు సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో తగిన సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందం పలు ప్రాంతాల్లో పర్యటించి పంప్‌హౌస్‌లను పగులగొట్టి అందులోని రాగివైర్లు, ప్లేట్లు, ఆయిల్‌ను దొంగతనం చేసిన వారిని మహారాష్ట్ర గ్యాంగ్‌గా గుర్తించింది. ఈ గ్యాంగులోని ముగ్గురు తిరిగి దొంగతనం చేసేందుకు ఏపీ వైపు వస్తున్నారన్న సమాచారం అందడంతో నందవరం మండలం నాగలదిన్నె బ్రిడ్జి దగ్గర ఎమ్మిగనూరు రూరల్, మంత్రాలయం సీఐలు విక్రమ్‌సింహ, రామాంజులు, నందవరం ఎస్ఐ శ్రీనివాసులు, మాధవరం ఎస్ఐ విజయ్‌లు నిందితుల ఫోన్‌కాల్ ఆధారంగా మాటువేసి అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.9 లక్షల నగదు, ఎంహెచ్ 22, ఏఎన్ 1154 హైచర్ లారీ, ఎంహెచ్ 23 ఈ 8141 మహేంద్ర జైలో జీపుతోపాటు 25 కేజీల కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నారు. గ్యాంగ్‌లో ఉన్న మరో నలుగురు దొంగలు పరారీ ఉన్నారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులు శంకర్, ప్రేమ్, హరి, ప్రసాద్, సయ్యద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరద గ్రామాలకు పవన్ కళ్యాణ్ ఆర్థిక సాయం



పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పాములపాడు, సెప్టెంబరు 9: వరదల కారణంగా నిండా మునిగిన ఉమ్మడి రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వరద బాధితుల సహాయ నిధికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆర్థిక సాయం అందించారని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, జనసేన జిల్లా అధ్యక్షుడు చింతాసురేశ్ బాబు, రామిరెడ్డి అన్నారు. సోమవారం పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశ భవనంలో జనసేన నాయకులు రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు జిల్లాల్లోని 400 పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి రూ. లక్ష చొప్పున పవన్‌కళ్యాణ్ అందించడం, అవి సొంత డబ్బును కేటాయించడం అభినందనీయమన్నారు. గత వైసీపీ పాలనలో ఆర్థిక సంఘం నిదులను ప్రభుత్వమే లాగేసుకోవడంతో గ్రామాలు కనీస మౌలిక వసతుల కూడా నోచుకోలేక సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే అన్నారు. పల్లెల అభివృద్ధి ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పని చేస్తుందని సీసీరోడ్లు, తాగునీటితో పాటు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు. భానను ముక్కల సర్పంచ్ క్రిష్ణవేణమ్మ భర్త బండ్లమూరి వెంకటేశ్వర్లు, వేంపెంట సర్పంచ్ మాణిక్యమ్మకు చెక్కులను అందించి, పారిశుధ్యం, తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, మధుక్రిష్ణ, సంపత్, మధు, ఘంటారాము, సూర్యబాబు, శేషు, సూర్య, చరణ్, గాబ్రైలు లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, పూసలక్రిష్ణ, ఏసేపు, అలీసాహెబ్, ఆదిరెడ్డి, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో లీలావతి

బండిఆత్మకూరు, సెప్టెంబరు 9: పని ప్రాంతాల్లో మహిళల పట్ల లైంగిక వేధింపులు తగదని ఐసీడీఎస్ సీడీపీవో లీలావతి అన్నారు. సోమవారం బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపుల అరికట్టేందుకు మండల స్థాయి, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే శిశు మరణాలు అరికట్టాలని, బాల్య వివాహాలను రూపుమాపటానికి ఈ కమిటీలు చురుగ్గా పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో వాసుదేవ గుప్త, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసులు, ఏపీఎ రాజశేఖరరెడ్డి, ఏఈలు లక్ష్మీనరసింహ, వెంకటయ్య, కంబగిరి, రవికుమార్, సూపర్‌వైజర్ రమాదేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 9: నందికొట్కూరు మండల కేంద్రంలోని బైరెడ్డి రాజశేఖరెడ్డి నగర్‌లో పేదలు నిర్మించుకున్న గుడిసెలకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరావు, పక్కీర్‌సాహెబ్, భాస్కరెడ్డి, గోపాలక్రిష్ణ గుడిసె వాసులు నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులుకు, మున్సిపల్ కమిషనర్ బేబీలకు వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం జిల్లానాయకులు గుడిసె వాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ బైరెడ్డి రాజశేఖరరెడ్డి నగర్‌లోని సర్వే నెంబరు 589, 590, 595లలో పేదలు నిర్మించుకున్న గుడిసెలకు ప్రభుత్వం వారు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

వరద బాధితులకు సరుకుల పంపిణీ



నందికొట్కూరు నుంచి సరుకులను తరలిస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నిత్యావసర సరుకుల కిట్లను నందికొట్కూరు టీడీపీ నాయకులు పంపించారు. టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యల ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి దాదాపు 3 వేల కిట్లను విజయవాడకు తరలించారు. బియ్యం, నూనె, కందిపప్పు, 5 రకాల కూరగాయలు ఒక కిట్టులా తయారు చేసి విజయవాడకు మినీ లారీలో పంపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ముర్తుజావళి, వేణుగోపాల్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



నందికొట్కూరు పట్టణంలో విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకుల

నందికొట్కూరు, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల కోసం సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు దుకాణాల వద్ద విరాళాలు సేకరించారు. దుకాణాల యజమానులు మానవతా దృక్పథంతో సహాయ సహకారాలు అందించారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘురాంమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి రజితమ్మ, పట్టణ మహిళానాయకులు భాను షరీఫా బేగం, ఏఐఎస్ఎఫ్ తాలుక అధ్యక్షులు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు గ్రామానికి చెందిన సిఎస్ఐ పాస్ట్రరేట్ కమిటీ సభ్యులు విజయవాడ వరదబాధితులకు ఆహారం పింపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. 1500 వేల రోట్టెలు కర్రీని తయారు చేసి వాటిని విజయవాడ వరద బాధితులకు సోమవారం పంపిణీ చేసినట్లు దామగట్ల సంఘం, మిడుతూరు పాస్టర్ చల్లా స్టీఫెన్, సంఘ పెద్దలు తెలిపారు.

గణేశ్ లడ్డూ వేలం పాటలు

ఆత్మకూరు, సెప్టెంబరు 9: ఆత్మకూరు పట్టణంలో సోమవారం జరిగిన గణేశ్ నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. తోటగేరిలో గణనాథుడి లడ్డూ వేలం పాటను పాణ్యం క్రిష్టయ్య తనయుడు శ్రీకృష్ణదేవరాయలు రూ.38 వేలు, అర్బన్ కాలనీ మెయిన్ సెంటర్‌లో కుందూరు రామ్మోహన్‌రెడ్డి రూ.32,500, సంగమేశ్వరం సర్కిల్‌లో శివకాశి రూ.15 వేలు, అయోధ్యనగర్‌లో కిరణ్ రూ.15500, గాంధీ పార్కు విగ్రహం వద్ద బొమ్మన శంకరరెడ్డి రూ.18500 దక్కించుకున్నారు.

మహానంది, సెప్టెంబరు 9: అబ్బీపురంలోని రామాలయంలోని వినాయక విగ్రహం దగ్గర మంచాల లక్ష్మీరెడ్డి రూ.29,000, కస్తూర్బాగాంధీ పాఠశాల సమీపంలోని కొత్తపేటలో నామాల ప్రసాద్ కుమారుడు నామాల సుజిత్ రూ.25,0000కు, శివాలయం విగ్రహం దగ్గర తలారి పెద్ద మద్దిలేటి రూ.16,000కు గొల్లపేటలో బండారు పుల్లన్న రూ.12,000కు లడ్డును వేలం పాట ద్వారా దక్కించుకున్నారు.



పాములపాడులో నిమజ్జనానికి తరలిపోతున్న గణనాథుడు



జూపాడుబంగ్లాలో...



మిడుతూరులో...

బైబై.. గణేశా..!



గోస్పాడులో..



కొత్తపల్లి, మహానందిలో..



దామగట్లలో వినాయకుడి ఊరేగింపు

భక్తులు వినాయక నిమజ్జనాన్ని సోమవారం సాయంత్రం ఘనంగా చేపట్టారు. పట్టణంలోని పలు చోట్ల వివిధ రూపాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలను ఊరేగించారు. మేళతాళాలు, డీజేలు, బాజాభజంత్రీలు, డప్పుల మధ్య భక్తులు కేరింతలతో తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. భక్తులు కోలాటాలు ఆడారు. ఈ వేడుకలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా గణేశ్ విగ్రహాల మండపాల వద్ద లడ్డూల వేలం పాటలు నిర్వహించారు. కొందరు భక్తులు అధిక మొత్తంలో పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు.



బండిఆత్మకూరులో...



గణనాథుడికి మొక్కుతున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరులో ముగిసిన నిమజ్జనం

ఆత్మకూరు, సెప్టెంబరు 4: ఆత్మకూరులో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని మూడో రోజు సోమవారం నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, అర్బన్ సీఐ ఓబులేసు, వినాయక ఉత్సవ సమితి జిల్లా కోఆర్డినేటర్ భూమారెడ్డి తొలిపూజలు చేసి శోభయాత్రను ప్రారంభించారు. పట్టణంలోని సుమారు 40పైగా వినాయక విగ్రహాలతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన గణనాథులకు పాములపాడు మండలం ఎర్రగూడూరు సమీపంలోని శ్రీశైలం కుడి ప్రధాన కాల్వ కొత్త వంతెన వద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు కంచర్ల గోవిందరెడ్డి, అధ్యక్షులు గరుడాద్రి సత్యనారాయణ, న్యాయ సలహాదారులు సుదర్శన్, వీహెచ్‌పీ నాయకులు శ్రీధర్‌గుప్తా తదితరులు ఉన్నారు.

నిమజ్జనం వేడుకను పరిశీలించిన ఎస్పీ : నిమజ్జన ఏర్పాట్లను ఎస్పీ ఆధిరాజ్ సింగ్ రాణా సోమవారం పరిశీలించారు. పాములపాడు మండలంలోని ఎర్రగూడూరు సమీపంలో నిమజ్జనం జరిగే ఎస్ఆర్ఎంసీ కాల్వను ఆయన పరిశీలించారు. అక్కడి ఏర్పాట్ల గురించి ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన క్రతువులో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండాకట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఆయన ఆదేశించారు.





గడివేములలో...



ఎమ్మెల్యే బుడ్డాను సత్కరిస్తున్న వినాయక ఉత్సవ సమితి ప్రతినిధులు



నంద్యాలలోని 37వ వార్డులో నిర్వహించిన గణేశ్ పూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నిమజ్జన ప్రదేశాల పరిశీలన



నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, సెప్టెంబరు 9 : జిల్లాలోని ఆత్మకూరు టౌన్, వెలుగోడులలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రదేశాలను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సోమవారం పరిశీలించారు. పోలీసులు తీసుకున్న భద్రతాచర్యలు, ట్రాఫిక్ తదితరాలపై చర్చించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి వచ్చే వాహనాల రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వరుస క్రమంలో విగ్రహాలను నిమజ్జనానికి అనుమతించాలని పేర్కొన్నారు. నిమజ్జనానికి తరలించే విగ్రహాల వెంట నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని, అలాంటి సందర్భాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉంటుందని కాబట్టి ఒక విగ్రహం వెంట ఐదునుంచి పదిమందిని మాత్రమే అనుమతించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జనానికి వెళ్లే వాహనాలు, నిమజ్జనం ముగించుకొని వచ్చే వాహనాలు వేర్వేరు మార్గాల్లో ప్రయాణించేలా చూసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2362విగ్రహాలు ఏర్పాటు చేయగా, ఈ రోజు 1747విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ వివరించారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వి.సంతోష్, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, పాములపాడు ఎస్ఐ సురేష్, నంద్యాల వీసీఆర్ ఎస్ఐ లక్ష్మయ్య, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఇసుక సరఫరా: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 8: ప్రభుత్వ నిర్ణయించిన ధరకే ఇసుక సరఫరా చేస్తామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉచిత ఇసుక రవాణా ధరల నిర్ధారణపై ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి నూతన ఉచిత ఇసుక విధానం అమలులోకి రానుందని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఇసుక సరఫరా చేయాలని కలెక్టర్ రాజకుమారి లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యులను ఆదేశించారు. నంద్యాల జిల్లాలో ఇసుక రీచులు, స్టాక్ యార్డులు లేవని సమీప జిల్లాల నుంచి ఇసుక సరఫరా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో స్టాక్‌యార్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. 197 టిన్‌టైర్స్ వాహనాలను రిజిష్టర్ చేసి ఆన్‌లైన్‌లో ఉంచామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తోందని, కేవలం రవాణా చార్జీలు మాత్రమే వినియోగదారులు భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆర్డీవో శివారెడ్డి, భూగర్భ గనుల శాఖ ఏడి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో మహిళ ఆత్మహత్యాయత్నం

శ్రీశైలం, సెప్టెంబరు 9: శ్రీశైలంలో సోమవారం ఓ మహిళ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శ్రీశైలంలోని శ్రీగిరి కాలనీలో నివాసం ఉంటున్న నాగమల్లన్న అనే మహిళ సోమవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని పార్కులో విషద్రావణాన్ని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను దేవస్థానం వైద్యశాలకు తరలించగా వైద్యులు సుండిపెంట వైద్యశాలకు రెఫర్ చేశారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఉన్నత వైద్యశాలకు రెఫర్ చేశారు. స్థానిక యువకునితో పెళ్లి విషయంలో వివాదం కారణంగా ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 9: మండలంలోని అబ్బీపురం గ్రామంలోని గిరిజన కాలనీని ఐటీడీఏలో చేర్చి, సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా కళ్యాణ్ మాదిగ మాట్లాడుతూ కాలనీలో మౌలిక సదుపాయలు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే మాదిగ బదితెల నడిపి పుల్లయ్యకు చెందిన శిరివెళ్ల మండలంలో ప్రభుత్వ సీలింగ్ భూమి ఖాతానెంబరు పునరుద్ధరించాలని, బుర్రారెడ్డి లక్ష్మీదేవికి చెందిన మోత్కులపల్లి గ్రామానికి చెందిన భూసమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జోసెఫ్, తోట ప్రభాకర్, ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

మహానంది దేవస్థానానికి ట్రాక్టర్ విరాళం



ట్రాక్టర్ కీని ఈవోకు అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

మహానంది, సెప్టెంబరు 9: మహానంది దేవస్థానానికి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా తరుపున పీఎస్ఆర్ ఫండ్స్ నుంచి మంజూరైన ట్రాక్టర్‌ను సోమవారం విరాళంగా అందజేశారు. నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్, నెట్‌వర్క్3 మేనేజర్ దినేష్ గులాటి, డిప్యూటీ జనరల్ మేనేజర్ సూర్యప్రకాష్, రీజనల్ మేనేజర్ రాఘవ యాదవ్, మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రాజేష్‌కుమార్ పటేల్ కలిసి ట్రాక్టర్ తాళాలను ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివయ్య

నంద్యాలరూరల్, సెప్టెంబరు 9: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా సమితి నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఎస్జీటీ, ఎన్‌టీఎస్ ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేయడం జరిగిందని, దీంతో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక సరైన విద్య అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏ, సరెండర్ లీవ్, ప్రావిడెంట్ రుణాలతో పాటు ఇతర ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు జాకీర్, నీలీశ్వరరెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

'ఆర్యవైశ్యులకు మంచి పేరు తీసుకొస్తాం'



భవనాశి బ్రదర్స్‌ను సన్మానిస్తున్న వాసవీయూత్ క్లబ్, పట్టణ ప్రముఖ ఆర్యవైశ్యులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 8: ఆర్యవైశ్యులకు మరింత మంచి పేరు తీసుకొస్తానని జిల్లా అధ్యక్షుడు భవనాశి నాగమహేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం నాయకులు, యూత్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భవనాశి నాగమహేశ్‌తో పాటు కాశీ అన్నపూర్ణ సత్ర సముదాయాల అధ్యక్షుడు భవనాశి శ్రీనివాసలను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీజీ వెంకటేష్, టీజీ భరత్‌ల సహకారంతో తమకు ఈ పదవులు లభించాయన్నారు. రాష్ట్రం నలుమూలలా ఎందరో దాతలు ఉన్నారని, వారి సహకారం మరువలేనిదన్నారు. శ్రీశైలంలో 84, వారణాశిలో 100 గదులను ఏర్పాటు చేస్తామన్నారు. అరుణాచలంలో సైతం కాశీ అన్నపూర్ణ వాసవీ సత్రం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మామిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు బీసీ ఇందిరమ్మ పూజలు



గణనాథుడికి పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, సెప్టెంబరు 9: పట్టణంలో సోమవారం పలు వినాయక మండపాల్లో రోడ్లు భవనాల శాఖ మంత్రి సతీమణి బీసీ ఇందిరమ్మ పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ గణనాథుల ఆశీర్వాదాలు ప్రజలపై ఉండాలన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, గౌరవ సలహాదారు టంగుటూరు శ్రీనాయ్య, వంగల పరమేశ్వరరెడ్డి, లాయర్‌బాబు, లాయర్ నాగేంద్రారెడ్డి, కృష్ణానాయక్, కూరగా యల శేఖర్, టీచర్ నాగరాజు, కోడినాగేశ్, తలారిహరి, ఖాదర్ పాల్గొన్నారు.

అహోబిలం గణేశ్ లడ్డూకు గిరాకీ

వేలం పాటలో రూ.1,01,116 పలికిన వైనం



చాగలమర్రి వేలం పాటలో
వినాయక లడ్డూ దక్కించుకున్న టీచర్ లలితకుమారి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 9: అహోబిలం గణేశ్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూకు గిరాకీ పెరిగింది. సోమవారం గణేశ్ నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన చింతలపల్లె శివనారాయణ (అంగడి బుజ్జి) రూ.1,01,116 వేలం పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా శివనారాయణను ఆలయ వేదపండితుడు విజయకుమార్‌శర్మ సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. లడ్డూను కైవసం చేసుకున్న శివనారాయణ లడ్డూ ప్రసాదాన్ని గ్రామంలోని ప్రజలకు పంచి పెడతానని తెలిపారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని న్యూబిల్డింగ్స్ వీధిలో కొలువుదీరిన వినాయక విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన లడ్డూ వేలం పాటలో న్యూబిల్డింగ్స్ వీధిలో నివాసం ఉంటున్న టీచర్ లలితకుమారి రూ.1.03 లక్షలతో వేలం పాట పాడారు. ద్వితీయ స్థానంలో పావని వేలం పాట పాడారు. ఇరువురిని విగ్రహ కమిటీ సభ్యులు సన్మానించి వినాయక లడ్డూ, వినాయక చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 9: మండలంలోని రూపనగుడి గ్రామ సమీపంలో ఉన్న కుందూనది వంతెన వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఎంపీడీవో ఉమమహేశ్వరరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుందూ నది వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మండలంలోని చాలా గ్రామాలు కుందూనది వంతెన వద్దే వినాయక నిమజ్జనం చేస్తారన్నారు. నిమజ్జన సమయంలో నదిలోకి దూకకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేందర్‌రెడ్డి, శానిటేషన్ మండల కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు చెన్నక్రిష్ణయ్య, వీఆర్వో నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

బీటెక్ విద్యార్థి ప్రతిభ

- మట్టితో 9 అడుగుల వినాయకుడి ప్రతిమ తయారీ
- పర్యావరణం కాపాడాలంటున్న విద్యార్థి హేమంత్

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 9: మండలంలోని చింతలాయపల్లె గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి హేమంత్‌కుమార్‌రెడ్డి అత్యంత ప్రతిభను ప్రదర్శించి మట్టితో 9 అడుగుల గణనాథుడి ప్రతిమను తీర్చిదిద్ది గ్రామంలో ప్రతిష్ఠించారు. తన తాత కొప్పుల నారాయణరెడ్డి సహకారంతో 30రోజులు శ్రమించి, ధన్వంతరి నారాయణ మహా గణపతితో పాటు లక్ష్మీదేవి, సరస్వతీ మాత ప్రతిమలను తయారు చేశాడు. ఈ ప్రతిమలను చూడటానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. హేమంత్ గుత్తి గేట్ కళాశాలలో చదువుతున్నాడు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు.



మట్టితో తయారు చేసిన గణపతి, లక్ష్మీదేవి, సరస్వతి ప్రతిమలు

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, సెప్టెంబరు 9: గ్రామాల్లో ప్రజలు కురుస్తున్న వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కుందూ, వక్కిలేరు, వాగులు దాటే ప్రయత్నం చేయరాదని అన్నారు. మట్టిమిద్దెలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మల్లేవేముల గ్రామంలో 80 మట్టిమిద్దెల్లో నివాసం ఉన్న వారికి ముందస్తుగా నోటీసులు కూడా ఇచ్చామని అన్నారు. దెబ్బతిన్న గృహాల్లో నివాసం ఉండరాదని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలుడికి డెంగీ

ప్యాపిలి, సెప్టెంబరు 9: పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన నాలుగేళ్ల బాలుడికి డెంగీ లక్షణాలు కనబడటంతో సోమవారం కర్నూలుకు తరలించారు. కాలనీకి చెందిన కాయల జయన్న, లక్ష్మి దంపతుల కుమారుడు జయవర్ధన్‌కు గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక ఓ ప్రైవేటు క్లీనిక్‌లో వైద్యం చేయించిన జ్వరం నయం కాలేదు. దీంతో సదురు వైద్యులు డెంగీ లక్షణాలు ఉన్నట్లు చెప్పడంతో తల్లిదండ్రులు కుమారుడిని కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాలుడి ఆరోగ్యం పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు.



సంజామల మండలం కమలపురిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



బనగానపల్లె మండలం జోలాపురంలో..



బేతంచెర్ల మండలం హెచ్. కొట్టాలలో..

వైభవంగా వినాయక నిమజ్జనం

నంద్యాల జిల్లాలోని వివిధ గ్రామాల్లో సోమవారం గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. శనివారం వినాయక చవితి సందర్భంగా మండపాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలకు మూడు రోజుల పాటు పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున వినాయకుడిని దర్శించుకున్నారు.



రూపనగుడి గ్రామం కుందూ నది వంతెన వద్ద వినాయకుడి నిమజ్జనం



రుద్రవరంలో..



ఆళ్లగడ్డలో..



చాగలమర్రిలో వినాయక విగ్రహాల ఊరేగింపును ప్రారంభిస్తున్న నంద్యాల సీఐ మోహన్‌రెడ్డి



కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లెలో..



ఉయ్యాలవాడలో ..



కోవెలకుంట్లలో..



అవుకులో..



ప్యాపిలిలో..

పట్టణాభివృద్ధికి నిరంతర కృషి : మంత్రి బీసీ

బనగానపల్లె, సెప్టెంబరు 9: బనగానపల్లె పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం బనగానపల్లె పట్టణంలో అధ్వాన స్థితిలోఉన్న రోడ్లను, డ్రైనేజీ కాల్వలను మంత్రి స్వయంగా అధికారులతో కలసి పర్యవేక్షించారు. పట్టణంలోని ఆస్థానం వద్ద రోడ్లు గుంతలమయంగా మారడడంతో ఆ ప్రాంతాన్ని తొలుత పరిశీలించారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో వర్షాలు తగ్గిన వెంటనే రూ..35 లక్షలతో బనగానపల్లె పట్టణంలో సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. పట్టణాన్ని సుందరంగా తీర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత వైసీపీ పాలనలో పట్టణంలో పనులు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం ఆస్థానం పక్కన రోడ్డు గుంతల మయంగా మారిందని అనేక మంది ఇక్కడ కిందపడ్డారని, మోటారు సైకిళ్లు కింద పడి ప్రమాదాలకు గురయ్యారన్నారు. ఆయన వెంట పలువురు పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, టీడీపీ నాయకులు టంగుటూరు శ్రీనయ్య, మౌళీశ్వరరెడ్డి, అహ్మద్‌బాషా, హర్షద్, జంగంశెట్టి, రాయలసీమ సలాం, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో పర్యటిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

జీవో 115ని రద్దు చేయాలి



డాక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న స్టాఫ్ నర్సులు

డోన్(రూరల్), సెప్టెంబరు 9: జీవో నెంబరు 115ని రద్దు చేయాలని స్టాఫ్ నర్సులు సోమవారం నిరసన చేపట్టారు. మండలంలోని చిన్నమల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన స్టాఫ్‌నర్సులు తమను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చెన్నకేశవులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది శ్వేత, సునీత, మల్లేశ్వరి, పార్వతి, వాణి పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలి

డోన్(రూరల్), సెప్టెంబరు 9: డోన్ పట్టణం నడిబొడ్డులో ఉన్న రెండు రైల్వే గేట్ల మధ్య ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని జిల్లా విజిలెన్స్ కమిటి సభ్యులు ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నరసింహరాజును కలిసి వినతి పత్రం అందజేశారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 9: మండలంలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఫ్యామిలీ డాక్టర్, నోడల్ ఆఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని బుగ్గాని పల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ భార్గవి, ఎంఎల్‌హెచ్‌పీ విజయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి: ఏవో

ప్యాపిలి, సెప్టెంబరు 9: పంట నమోదు చేయించుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాలో ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో రైతులకు ఈకేవైసీ చేశారు. ఏవో మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న రైతులకే ప్రభుత్వం అందించే రాయితీలు వర్తిస్తాయని తెలిపారు.

పైపులైన్లకు మరమ్మతులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 9: కొలిమిగుండ్లలోని పలు కాలనీల్లో లీకేజీ పైపులైన్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ జినుగు శివ రాముడు తెలిపారు. ప్రధాన రహదారిలోని ఎర్రవాగు వద్ద పైప్‌లైన్ లీకేజీని గుర్తించి వెల్డింగ్ పనులు నిర్వహించారు.

మల్లారెడ్డికుంట గండికి మరమ్మతులు



చిన్నవంగలి మల్లారెడ్డి కుంట గండిని పరిశీలిస్తున్న డీఈ, ఏఈ

చాగలమర్రి, సెప్టెంబరు 9: మండలంలోని చిన్నవంగలి గ్రామ సమీపంలోగల మల్లారెడ్డి కుంట గండికి మరమ్మతులు చేపడతామని ఆళ్లగడ్డ మైనర్ ఇరిగేషన్ డీఈ గురుమూర్తి, ఏఈ మునాఫ్ తెలిపారు. సోమవారం మల్లారెడ్డి కుంట కట్ట గండిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ రూ.5 లక్షలతో తాత్కాళిక మరమ్మతు పనులు చేపడతామని అన్నారు. నీరు వృథా పోకుండా పనులు వేగవంతం చేసి కట్ట పటిష్టం చేస్తామని అన్నారు. శాశ్విత మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని అన్నారు. వ్యవసాయశాఖ వారు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టం అంచనా వేస్తారని అన్నారు. వారి వెంట టీడీపీ నాయకులు నరేంద్రారెడ్డి, నర్సిరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, సంజీవరెడ్డి, రైతులు ఉన్నారు.

వరద బాధితుల కోసం 16 బస్తాల బియ్యం



సేకరించిన బియ్యం ఆటో వద్ద సీపీఐ నాయకులు

రుద్రవరం, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో సోమవారం 16 బస్తాల బియ్యాన్ని సీపీఐ సేకరించినట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి బాలనరసింహుడు తాలుకా కార్యదర్శి భాస్కర్ తెలిపారు. ఇంటింటికీ తిరిగి బియ్యం సేకరించి బస్తాల్లో నింపి ఆటోలో విజయవాడ వరద బాధితుల కోసం పంపడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ వరదబాధితుల కోసం తమ వంతు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

డోన్, సెప్టెంబరు 9: సమాజంలో జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గణేష్ ఉత్సవాల సందర్భంగా కోట్ల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కోట్ల సుజాతమ్మ మెమెంటోతో పాటు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, లక్ష్మీనారాయణ యాదవ్, ఓంప్రకాష్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

రోగులకు అన్నదానం

బేతంచెర్ల, సెప్టెంబరు 9: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్లాబకాష్ దర్గా సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో రోగులకు మహిళలు సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురా మధు సుధాకర్ రెడ్డి సహకారంతో డ్రైవర్స్ కాలనీలో అల్లాబకాష్ దర్గా వద్ద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ హాస్పిటల్‌లో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రామకృష్ణారెడ్డి, సభ్యులు మనోహర్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా యాగంటీశ్వరుడి పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, సెప్టెంబరు 9: బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ ఉత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ పూజారులు, సిబ్బంది తీర్థ ప్రసాదాలు అందించారు.

చాగలమర్రిలో ఎడతెరిపి లేని వర్షాలు

పొంగి ప్రవహిస్తున్న కుందూ, వక్కిలేరు



మల్లేవేముల సమీపంలో ప్రవహిస్తున్న కుందూ నది

చాగలమర్రి, సెప్టెంబరు 9: చాగలమర్రి మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేని కుండపోత వర్షం కురిసింది. సోమవారం కురిసిన వర్షానికి వక్కిలేరు, కుందూ నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు జలమయమయ్యాయి. రాజోలి ఆనకట్ట వద్ద 14 వేల క్యూసెక్కులతో కుందూనది పొంగి ప్రవహించింది. అడ్డవాగు పొంగి ప్రవహించడంతో రైతులు, కూలీలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.